# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

93
ధారావాహిక



**జరిగిన కథ :** ఆస్థాన నాట్యాచార్యుడు కంకుభట్టు నిర్వహిస్తున్న నాట్య గురుకులానికి ఓ సాధారణ పౌరుడిలా వెళ్లాడు జాయపుడు. గురుకులం తలుపు తోసి తొంగిచూస్తున్న జాయపుణ్ని.. ఎవరో మెడపట్టి బయటికి తోశాడు. లోపలికి ప్రవేశం లేదంటూ అక్కణ్నుంచి వెళ్లగొట్టాడు. కానీ, జాయపుడికి లోపలికి వెళ్లాలన్న ఆసక్తి అంతకంతకూ పెరిగిపోతున్నది. ఏం చెయ్యాలని ఆలోచిస్తూ.. గురుకుల భవనం వెనక్కి వెళ్లాడు. కృష్ణమ్మ అంచుపై కట్టిన ఆ భవంతి వెనక ఏవేవో కర్రలు, చెక్కలు ఉండగా.. వాటిపైకెక్కి ఓ అమ్మాయి లోపలికి తొంగిచూస్తున్నది. రెండులిప్తల కాలం అలా ఆమెనే చూశాడు.

అప్పుడే ఆమె తల బయటికి పెట్టి.. చూపువాల్చి, తననే చూస్తున్న జాయపుణ్ని చూసింది. మరుక్షణం జాయపుడు చూసిన ఓ అద్భుత దృశ్యం అతణ్ని నివ్వెరపరచింది.

ఎవరో తనను చూస్తున్నారని గుర్తించిన ఆ అమ్మాయి కంగారుపడి.. వెనక్కి కదిలి ఒక్కఊపు తీసుకుని, ఓ గొప్ప క్రీడాకారిణిలా ఎగిరి పెద్దమొగ్గ వేసి.. సర్రున కృష్ణానది పాయలోకి జారింది. ఎంతో అనుభవం ఉంటే తప్ప ఎవ్వరూ అలా మొగ్గవేసి నదిలోకి దూకలేరు. ఆమె మునక వేసి లేచి జాయపుణ్ని చూస్తూ అల్లరిగా నవ్వింది. నాలుక చాచి, మడిచి వెక్కిరించింది. వేలితో మరోలా వెక్కిరించింది. శరీరాన్ని మొత్తంగా ఊపి ఇంకోలా వెక్కిరించింది. ఎన్నో వైవిధ్యమైన వెక్కిరింపులు. ఆనక మళ్లా నీళ్లల్లో ఎగిరిదూకి సర్రున మునిగి లేచి.. వేగంగా అవతల ఒడ్డుకు ఈదుకుంటూ పోయింది.

నది పాయ తక్కువగా ఏమీ లేదు. మరీ పెద్దది కాదు గానీ, ఆమె ఆ పాయను లిప్తల సమయంలో ఈది ఆవలి ఒడ్డున లేచింది. నాలుగడుగులు వేసి.. వంగి.. కట్టిన చీరెగోచి విప్పి, తొడలవరకు చీరెను పట్టి నీటిని పిండింది. తర్వాత ఛాతికున్న కుప్పసాన్ని తీసేసి.. నీళ్లు పిండి, ఆనక జెండాలా తిప్పుతూ.. విజయ సంకేతంలా.. 'నన్ను పట్టుకోలేకపోయావ్!' అన్నట్లు గంతులేసింది.

రెప్పపడటం లేదు జాయపునికి.

ఆమె ఆచ్ఛాదనా రహితమైన వక్షస్థలం మృదువుగా ఎగిరెగిరి పడుతుండగా.. ఆమె నాట్యమాడుతున్నది.

కుప్పసం ఊపుతూనే ఉంది. రొప్పొచ్చి వగరుస్తూ ఆగి.. నడుముపై చేతులుంచి, జాయపుణ్నే చూస్తున్నది.

విజయవిలాసం ఆమె నిలబడిన భంగిమలో..

నాట్యం ఆపినా రొప్పువల్ల ఆమె నిండు వక్షస్థలం మంద్రంగా గంతులు వేస్తూనే ఉంది.

కళ్లముందు కనిపిస్తున్న దృశ్యం.. జరిగిన మొత్తం సన్నివేశం.. అతనికి అబ్బురంగా తోస్తున్నది.

ఏం జరిగింది!? ఎందుకు తను ఇక్కడికి వచ్చాడు!? ఏం చూశాడు!? ఈ పిల్ల.. ఈ అద్భుత లలామ ఎవరూ!? ఆమెనే చూస్తున్నాడు.. రెప్పవెయ్యకుండా.

తిరిగి కుప్పసం తొడిగింది. జుట్టు విప్పి పిండి మళ్లీ ముడివేసుకుంది.

అప్పుడు చూశాడు.. అక్కడొక కర్రస్తంభం నాటి ఉంది. దానికేదో దేవతావిగ్రహం కట్టి ఉంది. ఆమె ఆ విగ్రహానికి నమస్కరించి స్థానకం తీసుకుని నర్తించసాగింది. మతిపోయింది జాయపునికి.. బహుశా లోపల చూసిన నాట్య విన్నాణం అక్కడ దేవుని ఎదుట నర్తిస్తున్నట్లు గుర్తించాడు.

అప్పుడే ఎవరో వెనగ్గా భుజంపై తడితే.. అప్పుడు ఇహలోకంలోకి వచ్చి వెనుదిరిగి చూశాడు.

నాట్యాచార్యుడు కంకుభట్టు.. ఇందాక మెడపట్టి గెంటిన కాపలావాడు.

''ఎవరు మీరు? ఇక్కడ.. మా గురుకులం వెనుక ఏం చేస్తున్నారు?''.

'హమ్మయ్య!' అనుకున్నాడు జాయపుడు.

ఎందుకంటే జాయపుణ్ని కంకుభట్టు గుర్తించలేదు.

''తమరిని కలవడానికి వచ్చాను. ఇతగాడు నన్ను మెడపట్టి గెంటివేశాడు'' అన్నాడు నవ్వుతూ జాయపుడు. మళ్లీ తనే..